జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 53 సోమవారం 14 జూలై 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ప్రముఖ నటుడు కోట శ్రీనివాస రావు కన్ను మూత



హైదరాబాద్ జూలై 13(సందేశం టైమ్స్):టాలీవుడ్ సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు ఆదివారం కన్నుమూశారు . గత కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున ) తెల్లవారుజామున ఫిల్మ్నగర్లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు .కోట నాలుగు దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో రకాల పాత్రలు చేసి ప్రేక్షకుల్ని మెప్పించారు. కేవలం తెలుగులోనే కాదు.. తమిళం, హిందీ భాషల్లో కూడా తన సత్తా చాటారు..పస్థానం..తెలుగు చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా తనదైన ముద్ర వేసుకున్న నటులలో కోటా శ్రీనివాసరావు ఒకరు. కమెడియన్ గా విలన్ గా ఈయన చేసిన సినిమాలు ఎన్నో సూపర్ డూపర్ హిట్ అయ్యాయి కొన్ని సినిమాలకు అవార్డులను కూడా అందుకున్నారు. 750 కి పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు1942 జులై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో కోట శ్రీనివాసరావు జన్మించారు. 1978లో 'ప్రాణం ఖరీదు'తో సినీరంగంలోకి అరంగ్రేటం చేశారు. 4 దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించారు. 750కి పైగా చిత్రాల్లో నటించారు. 1999-2004 వరకు విజయవాడ తూర్పు నియోజకర్గ భాజపా ఎమ్మెల్యేగా పనిచేశారు.1978 నుంచి 2023 వరకు వరుసగా సినిమాల్లో నటించారు. ఆ తర్వాత నడవలేని స్థితిలో ఉన్న ఆయన సినిమాలకు దూరంగా ఉంటున్నారు. గత కొన్నిరోజులుగా అనేక అనారోగ్య సమస్యలతో పోరాడుతున్న ఆయన ఇవాళ తెల్లవారుజామున 4 గంటలకు ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మరణ వార్త విన్న టాలీవుడ్ సినీ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

## శ్రీఉజ్జయినీ అమ్మవారికి సిఎం రేవంత్ పట్టువస్త్రాల సమర్పణ

### అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన సీఎం బోనాలు సమర్పించిన మంత్రి సురేఖ



హైదరాబాద్,జూలై 13(సందేశం టైమ్స్):సికింద్రాబాద్ లష్కర్ బోనాలు జాతర సందర్భంగా శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సీఎం రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి కొండా సురేఖతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఉదయం 11.00 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయానికి చేరుకున్నారు. సీఎంకు ఆలయ మర్యాదాలతో పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి తీసుకు వెళ్లారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి దంపతులు అందజేశారు.

## కోట మరణం పట్ల చిరంజీవితో సహా పలువురు సినీ ప్రముఖుల సంతాపం

హైదరాబాద్ జూలై 13(సందేశం టైమ్స్): ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల పలువరు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరంటూ తమ సందేశాలలో పేర్కొన్నారు. కాగా, మెగాస్టార్ చిరంజీవితో సహా పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణులు కోటా నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు.. కోట భౌతికకాయాన్ని చూసి బాబు మోహన్ బ్రహ్మానందం బోరున విలపించారు

విభిన ప్రాతకు ఆయన చిరునామా చిరంజీవి

లెజెండరీ నటులు, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కోట శ్రీనివాస రావు గారు ఇక లేరనే వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. 'ప్రాణం ఖరీదు' చిత్రంతో ఆయన, నేను ఒకేసారి సినీ కెరీర్‌ను ప్రారంభించాం. ఆ తర్వాత వందలాది సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రనీ తన విలక్షణమైన,



ప్రత్యేక శైలితో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇటీవలి కాలంలో ఆయన కుటుంబంలో జరిగిన వ్యక్తిగత విషాదం ఆయన్ని మానసికంగా ఎంతగానో కుంగదీసింది. కోట శ్రీనినివాస రావు గారి లాంటి నటుడి లోటు చిత్ర పరిశ్రమకి, సినీ ప్రియులకి ఎన్నటికీ తీరనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకి, శ్రేయోభిలాషులకి, అభిమానులకి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

## ప్రేక్షకుల హృదయాలలో కోట స్థానం శాశ్వతం ..కెసిఆర్

జూలై 13(సందేశం టైమ్స్):హైదరాబాద్ ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు సంతాప ప్రకటన విడుదల చేశారు కేసీఆర్. విభిన్న పాత్రలను పోషించి, ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్న విలక్షణ వెండితెర నటుడు కోట అని ఉద్ఘాటించారు. కోట మరణంతో సినిమా రంగం గొప్ప నటుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరన్నారుఉ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్



ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా, అసాధారణ పాత్రధారిగా తనదైన ముద్ర వేసిన కోట శ్రీనివాసరావు మరణం ఆవేదన కలిగించిందన్నారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్య నటుడిగా ఆయన పోషించిన విభిన్న పాత్రలు తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు.

## తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి గాలిలోకి కాల్పులు




హైదరాబాద్ జూలై 13(సందేశం టైమ్స్):మేడిపల్లిలోని తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్) కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు కార్యాలయంపై దాడి చేశారు. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి నాయకులు దాడికి దిగారు. ఈ క్రమంలో మల్లన్న గన్‌మెన్ గాల్లోకి 5 రౌండ్లు కాల్పులు జరిపారు.. జాగృతి కార్యకర్తల దాడిలో మల్లన్న ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం అయింది. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆ ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొనడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో దాడి జరిగినట్లు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను బయటకు పంపిస్తున్నారు. అయితే.. జాగృతి నేతల దాడి సమయంలో మల్లన్న ఆఫీస్ లోనే ఉన్నారు. ఆఫీస్‌పై దాడి జరగడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. తీన్మార్ మల్లన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా,. మీడియా సంస్థలపై దాడులు చేయడం సరికాదని తీన్మార్ మల్లన్న అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని తీన్మార్ మల్లన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పేదోడి జీవితంలో వెలుగులు నింపిన కాంగ్రెస్ : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



జూలై 13(సందేశం టైమ్స్): ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పేదోడి సొంతిల్లు కలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను అందజేసి వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపిందని నిజామాబాద్ రూరల్ (ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్నింటినీ అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే అన్నారు.శుక్రవారం నిజామాబాద్ రూరల్ నియోజ కవర్గంలోని మల్కాపూర్ (ఏ) గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను రూరల్ ఎమ్మె ల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రూరల్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మల్కాపూర్(ఏ) గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పారదర్శకంగా నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.


## ఆర్యవైశ్య ఎన్నికల్లో గందరగోళం.. రిగ్గింగ్ ఆరోపణలతో ఉద్రిక్తత

నిజామాబాద్ జూలై 13(సందేశం టైమ్స్): నిజామాబాద్ నగరంలోని ఆర్యవైశ్య పట్టణ సంఘ ఎన్నికల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఆదివారం నిజామాబాద్ నగరంలోని మాణిక్ భవన్ పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓటింగ్ సందర్భంగా బ్యాలెట్ పత్రాలు చింపివేసి దొరికిన ఘటన చోటు చేసుకుంది. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.ఈ ఘటనపై పోటీలో ఉన్న అభ్యర్థులు బైఠాయించి నిరసనలు తెలుపుతూ, ఎన్నికల ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సజావుగా జరగలేదని.. బ్యాలెట్ పత్రాలు చిరిగిపోయి దొరికాయని చెబుతూ, దీనికి ఎన్నికల అధికారులే



బాధ్యత వహించాలంటూ డిమాండ్ చేశారు.

# రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు !




జూలై 13(సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 15వ తేదీన ఆయన హస్తినకు బయల్దురనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో సమావేశాలు, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

ముఖ్య అంశాలు:

కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో భేటీలు.

పోలవరం, బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా రాష్ట్రంలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులపై చర్చ.

గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, కేంద్ర నిధుల విడుదలపై చర్చ.ఢిల్లీ మెట్రో రైల్ ఎండీ, నీతి ఆయోగ్ సభ్యులతో సమావేశం.మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సభలో ప్రసంగం.

భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం.

కాగా, ఈ నెల 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు నాయుడు రానున్నాడు. జూలై 15వ తేదీ ఉదయం అమరావతి నుంచి ఢిల్లీకి బయలుదేరి 17వ తేదీ ఉదయం రాష్ట్రానికి తిరిగి వస్తాడు

# జనసేన నుంచి శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ వినుత బహిష్కరణ.. అసలు కారణమిదే..




శ్రీకాళహస్తి: జూలై 13(సందేశం టైమ్స్): జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వినుతను ఆ పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ మేరకు మీడియాకు జనసేన అధిష్టానం ఇవాళ(శనివారం) లేఖ విడుదల చేసింది. వినుత వ్యవహార శైలి జనసేన విధి విధానాలకి భిన్నంగా ఉండటంతో ఆమెని గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకి దూరంగా ఉంచినట్లు జనసేన హై కమాండ్ తెలిపింది. ఆమెపై చెన్నైలో జరిగిన ఓ హత్య కేసు ఆరోపణలు పార్టీ దృష్టికి వచ్చాయని గుర్తుచేసింది. ఈ క్రమంలో వినుత కోటను పార్టీ నుంచి బహిష్కరించామని జనసేన హై కమాండ్ ప్రకటించింది.కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ (రాయుడు)(24) చైన్నైలో దారుణ హత్యకి గురయ్యాడు. చెన్నై మిట్ రెడ్ హిల్స్ పరిసర ప్రాంతాల్లో రాయుడు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. వినుత డ్రైవర్ రాయుడు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి రాయుడు నానమ్మ వచ్చింది. ఆమెని పోలీసులు విచారణ చేశారు. మూడు నెలలుగా రాయుడుకు వినుత కుటుంబ సభ్యులతో విభేదాలు ఉన్నాయని తెలిపింది. రాయుడు మృతికి వినుత కుటుంబ సభ్యులే కారణమని అనుమానం వ్యక్తం చేశారు. రాయుడు నానమ్మ ఫిర్యాదు మేరకు వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు, వినుత తండ్రి భాస్కర్‌లని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు.

# పేర్ని నానిపై కేసు నమోదు..




జూలై 13(సందేశం టైమ్స్): మాజీ మంత్రి పేర్ని నానిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో రప్పా రప్పా అనటం కాదు చేసి చూపించండి.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పేర్ని నాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు.. అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ బియ్యం దొంగ పేర్ని నాని.. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు పేర్ని నాని వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కృష్ణా జిల్లాలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం కార్యక్రమాల్లో మాజీ మంత్రి పేర్ని నానివివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'లోకేష్ రెడ్ బుక్ అంటే.. మీరు రప్పా రప్పా అంటున్నారు.. ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలే తప్ప.. రప్పా రప్పా అని అనటం కాదు.. అంటూ కార్యకర్తలకు సూచించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


### అరాచకంపై అక్షర సమరం పుస్తకంలో

# జగన్ అరాచకాలను ఎండగట్టారు..



జూలై 13సందేశం టైమ్స్): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలో జరిగిన దుర్మార్గాలను 'అరాచకంపై అక్షర సమరం' పుస్తకంలో టీడీపీ సీనియర్ నేత, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఎండగట్టారని వక్తలు కొనియాడారు.ఇలాంటి ఎందరో నాయకుల పోరాట పటిమతోనే రాష్ట్రంలో నియంతృత్వానికి చిరునామా లేకుండా ప్రజలు చెరిపేశారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. వాషింగ్టన్ డీసీలో.. 'అరాచకంపై అక్షర సమరం' పేరుతో మన్నవ సుబ్బారావు రాసిన వ్యాస సంపుటిని ప్రముఖ దర్శకుడు కే.రాఘవేంద్రరావుతో కలిసి రఘురామకృష్ణంరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తప్పిదాలను సునిశితమైన విమర్శలతో, పరిశీలనాత్మకంగా శోధించి వివిధ పత్రికలకు 200కు పైగా వ్యాసాలను రాయడం అభినందనీయమన్నారు. కుల, మత, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ వికృత రాజకీయాలకు పాల్పడుతున్న నేపథ్యంలో మన్నవ సుబ్బారావు ప్రజల గొంతుకై తన కలం ద్వారా గళం విప్పారన్నారు. నేర రాజకీయాల కబంధహస్తాల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో తనవంతు పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు.


# శ్రీశైలంలో భక్తుల కిటకిట..



జూలై 13(సందేశం టైమ్స్): సెలవు రోజులు కావడంలో శ్రీశైలంలో భక్తుల కిటకిట.

ఆలయ మాడవీధుల్లో భక్తుల సందడి..నంద్యాల బ్యూరో, జులై 12, ఆంధ్రప్రభ : జ్యోతిర్లింగాలలో ఒకటైన ద్వాదశి లింగేశ్వరాలయంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నంద్యాల జిల్లాలో ఉన్న శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానంకు భక్తులతో పోటెత్తింది. శనివారం వేకువజామునుండే ఆలయమాడవిధుల్లో సందడి వాతావరణం నెలకొంది. వరుసగా సెలవులు రావడంతో భక్తులు తాకిడి అధికమైంది. శ్రీశైల పుణ్య క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీశైలంలోని పలు పురవీధులు భక్తులతో నిండిపోయాయి.

# పదో తరగతి ప్రశ్నాపత్రం మారిందోచ్




అమరావతి,జూలై 13(సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రం లో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లోని సృజనాత్మకత పరిశీలించేలా ప్రశ్నాపత్రంలో మార్పులు చేయాలని భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో సీబీఎస్ఈ బోర్డుతో పోల్చితే రాష్ట్ర బోర్డుల్లో ఉత్తీర్ణత తక్కువగా నమోదు అవుతోంది.

# ఎపిలోని అయిదు నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పంట




వెలగపూడి, జూలై 13(సందేశం టైమ్స్): ఏపీలోని 5 నగరాలు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులకు ఎంపికయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి నగరాలు పరిశుభ్రత విషయంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. ఇందులో విశాఖ నగరానికి' స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్' అవార్డు దక్కగా . విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు 'స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్' కేటగిరీలో ఎంపికయ్యాయి. రాజమండ్రి నగరం రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ అవార్డుకు ఎంపికైంది.స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించే ఈ సర్వేలో పట్టణాల్లోని పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పౌరుల సహకారం, స్థిరమైన పరిష్కారాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై( 13) ఆందోల్ నియోజకవర్గం లోని పుల్కల్ మండల్ సింగూర్ గ్రామానికి చెందిన మంగలి పోచమ్మ నిన్నటి రోజున అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ పెద్దలు త్రిషమ్మ మరియు మంత్రివర్యులు దావెూదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకు పోవడంతో తక్షణ సాయంగా అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందించారు సింగూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ తరఫున దామోదర్ రాజనర్సింహ గారికి మరియు త్రిష మేడం గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు



# కల్లు కాంపౌండ్లపై ఆకస్మిక దాడులు

హైదరాబాద్ సిటీ, జూలై 13(సందేశం టైమ్స్): గ్రేటర్ పరిధిలోని పలు కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందాలు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. శేరిలింగంపల్లి పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో అనుమతి లేని కల్లు దుకాణాన్ని మూయించి, దాని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశాయి. ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి ఆదేశాతో ఎస్టీఎఫ్ బృందాలు బాలానగర్, మూసాపేట్, కైతలాపూర్, ముషీరాబాద్, కాచిగూడ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లలో కూడా తనిఖీలు నిర్వహించి, శాంపిళ్లను సేకరించాయి. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# సంపాదకీయం

## ప్రైవేట్ సంస్థలకే నిర్మాణ బాధ్యతలు

భారత్ ఇంగ్లాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తితో చూస్తుండగా ప్రముఖ సిమెంట్ కంపెనీ వాణిజ్య ప్రకటన ట్యాగ్‌లైన్ ఒకటి నన్ను విశేషంగా ఆకర్షించింది. అదిలా ఉంది: ఇది నూటికి నూరుపాళ్ల సత్యం. అవును, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ విస్తరణ మధ్య బలమైన సానుకూల సంబంధముంటుంది. రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు మొదలైన వాటికి భవనాలు నిర్మించాలి. ఈ సామాజిక, సామూహిక సదుపాయాలను సమృద్ధిగా నిర్మించుకున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ విస్తరణ సాధ్యమవుతుంది. ఈ మౌలిక సదుపాయాలను మనం సత్వరమే అభివృద్ధిపరచుకోవాలి. అయితే వాటిని ఎలా నిర్మించుకోవాలో మనం తెలుసుకుని తీరాలి.జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప నిర్మాత. ఆయనను ద్వేషించేవారు చేస్తున్న విమర్శలు నయా పైసా విలువలేనివి. 1947లో మన దేశ జనాభా 34 కోట్లు. అక్షరాస్యత రేటు కేవలం 12 శాతం. తన 17 ఏళ్ల ప్రధానమంత్రిత్వ కాలంలో నెహ్రూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించారు. ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఉక్కు కర్మాగారాలు, ఐఓసీ, ఓఎన్‌జీసీ, ఎన్ఎల్‌సీ, హెచ్ఏఎల్, బీహెచ్ఈఎల్, ఇస్రో, భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ, ఇంకా ఎన్నో సమున్నత సంస్థలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలకు ఆయనే అంకురార్పణ చేశారు, నిర్మించి అభివృద్ధిపరిచారు. ఇదంతా జరిగింది స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలోను, అదీనూ విద్యా వ్యాప్తి చాలా తక్కువగా ఉన్న, సాంకేతికతలు అందుబాటులో లేని, మానవ వనరులకు నైపుణ్యాలు కొరవడిన కాలంలో అన్న వాస్తవాన్ని విస్మరించకపోతే నెహ్రూ నిర్మాణ సామర్థ్యం ఎంత మహోన్నతమైనదో అర్థమవుతుంది. నెహ్రూ నిర్మించినవి ఈ నాటికీ ఉన్నాయి, జాతి పురోగతికి అద్వితీయంగా దోహదం చేస్తున్నాయి. నెహ్రూ భారత్‌కు ఆర్థిక వనరులు తక్కువగా ఉండవచ్చునేమో కానీ, చిత్తశుద్ధి, అంకిత స్వభావం, ప్రతిభాపాటవాలు ఉన్న మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి.క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో చోళ చక్రవర్తి కావేరీ నదిపై గొప్ప ఆనకట్ట నిర్మించాడు. ప్రపంచంలో అత్యంత పురాతన ఆనకట్టలలో అదొకటి. నేటికీ ఉపయోగంలో ఉన్నది. వేలాది ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. అంతకంటే ముఖ్యంగా వరదల నియంత్రణకు ఇతోధికంగా తోడ్పడుతోంది. భారత్ నేటికీ ప్రతి రోజూ ఈ మహా నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నది. అయితే ప్రైవేట్ రంగంలో నిర్మాణాల, ప్రభుత్వ రంగంలో నిర్మాణాల నాణ్యత, మన్నిక మధ్య ఎంత వ్యత్యాసమున్నదో ప్రతి పౌరుడికీ బాగా తెలుసు. ఈ రెండు విధాల నిర్మాణ కార్యకలాపాలలోనూ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. అయితే వారు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు వేర్వేరుగా ఉంటున్నాయి. నిర్మాణ ప్రక్రియలూ భిన్నమైనవి. ప్రజల ధనంతో ప్రభుత్వ రంగంలో జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల తీరుతెన్నులను పరిశీలిద్దాం. ప్రైవేట్ నిర్మాణ కార్యకలాపాల నాణ్యత ఎంపిక చేసుకున్న ఆర్కిటెక్ట్, నియమించుకున్న కాంట్రాక్టర్, నిధుల లభ్యతపై ఆధారపడి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ నిర్మాణ కార్యకలాపాలు, మరీ ముఖ్యంగా జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులకు భూమి, నిధుల పరంగా అవరోధాలు ఉండవు. అయితే మనం చూస్తున్నదేమిటి? హైవేలు, కొత్త రోడ్లు నిర్మాణమయి అవగానే కుంగిపోతున్నాయి. మురుగునీటిని తీసుకువెళ్లే కాలవలు లేదా గొట్టాలు పగిలిపోయి రోడ్లపై మురుగునీరు వెల్లువెత్తుతోంది. దేశ రాజధానిలోని అశోకా రోడ్డులో గత 18 నెలల్లో మురుగునీటి గొట్టాలు పగిలిపోవడం, రోడ్డు కుంగిపోవడం మూడుసార్లు సంభవించింది. రోడ్లు గుంతలమయమైపోతున్నాయి. ఆ బాటల్లో ప్రయాణిస్తున్న వాహనాలు ఆ గుంతల్లో పడిపోతున్నాయి. గ్వాలియర్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఒక రోడ్డు 15 రోజులలోనే కుంగిపోయింది. గుజరాత్‌లోని మోర్బిలో మరమ్మతు నిర్వహించి వాహనాల రాకపోకలకు పునఃప్రారంభించిన ఒక వంతెన నాలుగు రోజులలోనే కూలిపోవడంతో 141 మంది మరణించారు. సరైన అర్హతలులేని కంపెనీకి ఆ వంతెన మరమ్మతు, పునరుద్ధరణ పనులను అప్పగించినట్టు విచారణలో వెల్లడయింది. సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్లే వంతెన కూలిపోవడం జరిగింది. బిహార్‌లో వంతెనలు నిర్మాణంలో ఉన్నప్పుడో లేదా నిర్మాణమైన వెంటనే కూలిపోతేనో ఆశ్చర్యపోయేవాళ్లు ఎవరూ ఉండరు సుమా! ఒక వంతెన అయితే నిర్మాణంలో ఉండగానే మూడుసార్లు కూలిపోయింది!ఎంత సమయం, మరెంత ధనం వృథా! ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటి కారణం జవాబుదారీతనం పూర్తిగా లోపించడమే. ఒక వినాశనకర ప్రాజెక్టుకు పలువురు అధికారులు బాధ్యులయితే అంతిమంగా ఆ నష్టానికి ఏ ఒక్కరూ జవాబుదారీ కాదు అన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించడం సాధారణమైపోయింది. రాజకీయ అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అపరిమిత ఆర్థిక లబ్ధిని సమకూర్చే మంత్రిత్వశాఖల విషయమై మంత్రుల మధ్య తీవ్ర పోటీ ఉంటోంది. చాలా రాష్ట్రాలలో 'రేట్ కార్డ్' ఉన్నది.

# ఇంటి పనులు సబార్డినేట్ విధుల్లో భాగం కాదనలేం

## కొందరు న్యాయాధికారుల తీరుతో ఆ విధులు మార్చలేం: హైకోర్టు




అమరావతి, జూలై 13 (సందేశం టైమ్స్): కొందరు న్యాయాధికారుల అనుచిత ప్రవర్తనను ఆధారంగా చేసుకుని ఆఫీస్ సబార్డినేట్లకు కేటాయించిన ప్రాథమిక విధులను మార్చలేమని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయాధికారుల నివాసాల్లో ఇంటి పనులు నిర్వహించేందుకు కొంతమంది ఆఫీస్ సబార్డినేట్లను అటాచ్ చేసే విధానం జిల్లా న్యాయవ్యవస్థలో కొనసాగుతోందని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఇంటి పనులు ఆఫీస్ సబార్డినేట్ విధుల్లో భాగం కాదన్న పిటిషనర్ వాదనను ఆమోదించలేమని పేర్కొంది. గృహసంబం?ధ పనుల నిర్వహణలో న్యాయాధికారుల నుంచి ఏమైనా వేధింపులు ఎదురైతే పరిపాలనాపరంగా ఫిర్యాదు చేయవచ్చని, వాటిపై తగిన చర్యలు తీసుకుంటారని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. దిగువ కోర్టుల్లో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులకు ఆయా న్యాయాధికారుల నివాసాల్లో అనధికారిక, ఇంటి పనులు అప్పగించకుండా సబార్డినేట్ జ్యుడీషియరీ అధికారులను ఆదేశించాలని కోరుతూ ఏపీ జ్యుడీషియల్ ఆఫీస్ సబార్డినేట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. ఉమ్మడి హైకోర్టు తీర్పుల నేపథ్యంలో 1992లో జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్న విధులను తుది జాబితాగా పరిగణించలేమని, అవసరమైన సమయంలో సబార్డినేట్లకు ఇతర విధులు కూడా అప్పగించవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది.



# ఉధృతంగా గోదారి

**కుక్కునూరు, వేలేరుపాడుల్లో కాజ్‌వేల మునక..**
**14 గ్రామాలకు రాకపోకలు బంద్**
**నిర్వాసితుల కాలనీలకు తరలివెళుతున్న జనం**
**ధవళేశ్వరం బ్యారేజీ గేట్లన్నీ ఎత్తివేత**
**3,54,341 క్యూసెక్కులు సముద్రంలోకి**

పోలవరం, ధవళేశ్వరం, ఏలూరు, అమరావతి, జూలై 13 (సందేశం టైమ్స్) వరద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన ప్రాణహిత నీరు గోదావరిలో కలుస్తుండటంతో భద్రాచలం వద్ద నీటి మట్టం వేగంగా పెరుగుతూ 37.2 అడుగులకు చేరుకుంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం 175గేట్లను ఎత్తి 3,54,341 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.70 అడుగులుగా ఉంది. భద్రాచలానికి దిగువన ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో వరద ముంపు తీవ్రత కనిపిస్తోంది. కుక్కునూరు-దాచారం మార్గంలో గుండేటి వాగు కాజ్‌వేపై వరద చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగు కాజ్‌వేపై వరద పెరుగుతుండ డంతో 14 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. స్థానికులు పునరావాస కాలనీలకు తరలివెళుతు న్నారు. వరదలతో ఏలూరు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అధికారు లను పంపింది. శనివారం తెల్లవారుజామున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాబోతుందని యంత్రాంగమంతా మరింత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మరోవైపు పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో... స్పిల్‌వే నుంచి 5,02,478 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు.

# కొత్త సైకిల్ వచ్చిందోచ్

## మెగా పీటీఎంలో మాటిచ్చిన సీఎం చంద్రబాబు
## నలుగురు చిన్నారులకు కొనిచ్చిన అధికారులు



కొత్తచెరువు,జూలై 13(సందేశం టైమ్స్): మెగా పీటీఎం 2.0 కార్యక్రమం నలుగురు చిన్నారులకు సంతోషాన్ని మిగిల్చింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన మాధవి కుమారుడు, ముగ్గురు కుమార్తెలకు సీఎం చంద్రబాబు హామీతో కొత్త సైకిళ్లు కానుకగా లభించాయి. గురువారం కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 2.0లో మాధవి, ఆమె పిల్లలతో సీఎం, మంత్రి లోకేశ్ ముఖాముఖిగా మాట్లాడి, వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. తన కుమారుడి ఆరోగ్యం బాగా లేదని మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని, నలుగురు బిడ్డలను చదివించే బాధ్యత తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మూడో తరగతి చదువుతున్న ఆమె చిన్న కుమార్తె సనను సీఎం పలకరించారు. 'నీకేం కావాలి?' అని అడిగారు. తనకు సైకిల్ కావాలని సన కోరడంతో నలుగురికీ సైకిళ్లు కొనివ్వాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. దీంతో ధర్మవరం తహసీల్దారు సురేశ్ సమక్షంలో నలుగురికీ కొత్త సైకిళ్లను అందజేశారు. మాధవి, ఆమె భర్త నరసింహుడు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇరిగేషన్ జేఈఈ కిశోర్ నిర్బంధం



విజయవాడ, జూలై 13 (సందేశం టైమ్స్): పోలవరం కాలువ గట్టు మట్టి తవ్వకాలను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారి ఒకరిని అక్రమార్కులు అర్ధరాత్రి నిర్బంధించిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో చోటు చేసుకుంది. కొద్ది రోజులుగా పోలవరం కాలువ కట్ట వెంబడి కొందరు మట్టి తవ్వకాలను తవ్వుతున్నారు. దీనిపై కొత్తూరు తాడేపల్లి గ్రామస్థులు పోలవరం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్ధరాత్రి 12.14 గంటలకు డీఈ అప్పిరెడ్డి, జేఈఈలు కిశోర్, కౌషిక్.. ఆ ప్రాంతానికి వెళ్లగా అక్రమార్కులు పారిపోయారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మట్టిని పక్కనే ఉన్న మామిడితోటలో పోస్తున్నారన్న సమాచారంతో జేఈఈ కిశోర్ ఆ తోటలోకి వెళ్లగా, ఆ తోట కాపలాదారుడు గేటుకు తాళం వేసి పారిపోయాడు. బయటికి వచ్చే మార్గం లేకపోవడంతో ఆయన డీఈకి ఫోన్ చేశారు. డీఈ.. గ్రామస్థులకు కబురుపెట్టగా వారు వచ్చి తోట గేటుకు ఉన్న తాళం పగులగొట్టి కిశోర్‌ను బయటికి తీసుకొచ్చారు. కాగా, విజయవాడ రూరల్ మండలం పరిధిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం కాలువ మట్టి కట్టల వెంబడి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వారు. కూటమి అధికారంలోకి వచ్చిన క్రమంలో ఈ తవ్వకాలపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ నివేదిక ఇవ్వాల్సిన తరుణంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

# వంశధార ప్రధాన ఎడమ కాలువకు రంధ్రం

**కాలువ గట్టుకు పడిన రంధ్రం**
**పూడ్చిన అధికారులు.. తప్పిన ముప్పు**



%టెక్కలి, జూలై 13 (సందేశం టైమ్స్):వంశధార ప్రధాన ఎడమ కాలువ టెక్కలి సమీ పాన 65.6వ కిలోమీటరు వద్ద లెఫ్ట్ బ్యాంక్ అండర్‌టర్నల్ సమీప గట్టుకు రంధ్రం ఏర్పడింది. అయితే శుక్రవారం ఉదయం రంధ్రం వెంబడి నీరు వెళ్లడం గమనించిన రైతులు వంశధార అధికా రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు అక్కడకు చేరు కొని రంధ్రం పూడ్చే పనిలో పడ్డారు. వంశధార ఈఈ బి.శేఖరరావు ఆధ్వ ర్యంలో యుద్ధ ప్రాతిపదికన ఎడమకాలువ గట్టుకు పడిన రంధ్రాన్ని పూడ్చడంతో ముప్పు తప్పింది. వంశధార కాలువ వెంబడి 584 క్యూసెక్కుల సాగునీరు ప్రవహిస్తుందని, సకాలంలో గుర్తిం చడం ద్వారా ప్రమాదం తప్పిందని ఈఈ తెలి పారు. ప్రస్తుతం మదనగోపాలసాగరంలోకి నీరు పూర్తిస్థాయిలో చేరిందని, శనివారం నాటికి పలాస పరిధిలో కాలువలకు సాగునీరు చేరుతుందని స్పష్టం చేశారు.

# అక్రమంగా డబ్బుల వసూళ్లు



శ్రీకాకుళం రూరల్,జూలై 13(సందేశం టైమ్స్): పాలకొండ మండలం బాసురు వెంకటపతి రాజుపేట గ్రామానికి చెందిన రైతు గోవిందరావును భయపెట్టి అక్ర మంగా డబ్బులు వసూలు చేసిన కేసులో ఓ ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం పీఎన్ కాలనీకి చెందిన పైల చంద్రశేఖర్, పెద్దపాడుకు చెందిన బొట్ట శంకర్.. ఓ వివాదంలో గోవిందరావు తన కుమారుడు ఇరుక్కున్నాడు. దీంతో ఆ వ్యక్తులిద్దరూ ఈ కేసు నుంచి తప్పించేందుకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో గోవిందరావు చంద్రశేఖర్‌కు రూ.1.5 లక్షలు, శంకర్‌కు రూ.20వేలు ఇచ్చాడు. గోవిందరావు శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారిద్దరిని పెద్దపాడు ఫ్లై ఓవర్ వద్ద అరెస్టు చేశారు. వీరినుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

# పాఠశాలను తరలించొద్దు



ఆమదాలవలస, జూలై 13 (సందేశం టైమ్స్): కృష్ణాపురం మునిసిపల్ ప్రాథమిక పాఠ శాలను తరలించవద్దని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు పాఠశాల ఆవరణ లో విద్యార్థులతో కలిసి వారి తల్లిదండ్రులు నిరసన తెలి పారు. ప్రైమరీ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేయవద్ద న్నారు. పాఠశాలను తరలిస్తే సహించేది లేదన్నారు. పాఠశాలలో కనీసం 12 మంది విద్యార్థులుండాలని నిబంధనలు చెబుతున్న అధికారులు ఇక్కడ సుమారు 21 మంది విద్యార్థులుంటే వారందరినీ చిన్న కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

# అల్లూరి జిల్లాలో 30 మంది వైద్యుల నియామకం



పాడేరురూరల్, జూలై 13 (సందేశం టైమ్స్): అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న 30 వైద్యాధికారుల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్.టి.విశ్వేశ్వరరావునాయుడు తెలిపారు. వీరిలో 10 మంది వైద్యులు జాయిన్ అయ్యారని ఆయన చెప్పారు. శుక్రవారం పోస్టింగ్ ఆర్డర్‌తో డీఎంహెచ్‌వో కార్యాలయానికి పది మంది రాగా.. వారికి మూవెంట్ ఆర్డర్ అందజేశామన్నారు. వారికి కేటాయించిన పీహెచ్‌సీలలో విధులలో చేరడం జరిగిందన్నారు. మిగిలిన 20 మంది వైద్యాధికారులు రిపోర్టు చేయాల్సి ఉందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యులకు శుభాకాంక్షలు తెలిపిన డీఎంహెచ్‌వో ఆదివాసీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠ వ్యాధి, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్.కమలకుమారి పాల్గొన్నారు.

# టిఫిన్ చేస్తుండగా గ్యాస్ లీక్



ఆమదాలవలస, జూలై 13(సందేశం టైమ్స్): పట్టణంలోని పదో వార్డు వాంబే కాలనీలో ఓ ఇంటిలో గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాలనీకి చెందిన గుంటుకు సరస్వతి టిఫిన్ వ్యాపారం చేస్తోంది. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆమె గాయపడింది. విషయం తె లుసుకున్న ఎదురింట్లో నివసిస్తున్న కోల మాధవరావు ఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించగా అతనికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.70 వేలు నష్టం ఉంటుందని బాధితురాలు సరస్వతి వా పోతుంది. ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్యాస్ సిబ్బంది చేరుకుని ప్రమాదం జరిగిన తీరును బాధితురాలిని అడిగి తెలుసుకు న్నారు. స్థానిక టీడీపీ నాయకుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్ బాధితురాలిని పరామర్శించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు.

# పొలాల గట్లపై రేషన్

**పోలూరులో పొలం గట్టుపై బయోమెట్రిక్ వేయించి.. రేషన్ సరుకుల పంపిణీ**
**వెంటాడుతున్న సిగ్నల్స్ సమస్య**
**గిరిజనులకు తప్పని ఇబ్బందులు**



మెళియాపుట్టి,జూలై 13 (సందేశం టైమ్స్): రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేసినా.. సిగ్నల్ సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. పొలాల గట్టు, బహిరంగ ప్రదేశాల్లో సిగ్నల్స్ కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. అక్రమాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ నిలిపివేసింది. గత రెండు నెలలుగా డిపోల్లో డీలర్ల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తోంది. ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి 15లోగా రేషన్ సరుకులు పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టం చేసింది. కాగా, మెళియాపుట్టి మండలం పోలూరు జీసీసీ డిపోలో మాత్రం ఈ నెల 9 నుంచి రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించారు. ఒకవైపు సిగ్నల్ లేక బయోమెట్రిక్ కోసం ఇబ్బందులు పడుతుండగా.. ఇక్కడ పనిచేస్తున్న సేల్స్‌మెన్ దేవిడ్‌ను పాతపట్నం జీసీసీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో అల్లూరిసీతారామరాజు జిల్లా జీసీసీ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న కేశవరావును ఈ నెల 10న ఇక్కడ నియమించారు. దీంతో రేషన్ పంపిణీ ఆలస్యమైంది. డిపో పరిధిలో సుమారు 381 రేషన్‌కార్డులు ఉన్నాయి. గ్రామంలో సిగ్నల్ సక్రమంగా లేకపోవడం, రేషన్ సరుకుల పంపిణీకి గడువు సమీపిస్తుండడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. సిగ్నల్స్ కోసం పొలాల గట్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ వేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. సిగ్నల్ సమస్య కారణంగా రోజుకు 20 మంది లబ్ధిదారులకు కూడా సరుకులు అందడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి గిరిజన ప్రాంతాల్లో రేషన్ సరుకుల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

# క్యూటెస్ట్ వీడియో ఆఫ్ ద డే




చాట్రాయి,జూలై 13 (సందేశం టైమ్స్): చాట్రాయి మండలం పోలవరం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని రాళ్ళబండి శుభశ్రీ రూపొందించిన 'మెగా పేరెంట్స్ డే' రీల్‌కు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ 'క్యూటెస్ట్ వీడియో ఆఫ్ ద డే' అంటూ కితాబు ఇచ్చి, ఆ వీడియోని డౌన్‌లోడ్ చేసుకుని తన సోషల్ మీడి యా అకౌంట్‌లో పోస్టు చేశారు. మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న ప్రసాదరాజు, సుకన్య దంపతుల కుమార్తె భానుశుభశ్రీ 'భాను విలేజ్ ?థాట్స్' పేరుతో రీల్స్ చేసి సామాజిక మాధ్యమాలలో పోస్టు చేస్తోంది. పల్లె వాతావరణం, పచ్చటి పంట పొలాలు, అంత రించి పోతున్న పల్లె ఆటలు, స్వచ్ఛమైన గాలి,నీరు, చిన్ననాటి సంగతులు, పల్లె సంస్కృతి సంప్రదాయాలు మొదలైన అంశాలపై రీల్స్ చేస్తూ ప్రశంసలు పొం దుతోంది. ఈమెకు 1.76 లక్షల మంది ఫాలోవర్స్ ఉండడం విశేషం. కాగా తాను చదివే స్కూల్ జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ విశేషాలను వివ రిస్తూ ఆమె రీల్ చేసి పోస్టు చేయగా మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

# ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య



భోగాపురం,జూలై 13(సందేశం టైమ్స్): ప్రేమ విఫలమై ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాయవలస పంచాయతీ నారుపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పి.సూర్యకుమారి, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నారుపేటకు చెందిన అట్టాడ కనకరాజు, సరస్వతి దంపతులకు కుమార్తె పుష్ప(22), కుమారుడు ఆదినారాయణ ఉన్నారు. పుష్ప శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో ఫిల్లింగ్ ఆపరేటర్‌గా రెండేళ్లుగా పని చేస్తుంది. పుష్ప, విశాఖ జిల్లా మాడుగులకు చెందిన సాయి అనే యువకుడు ప్రేమించుకుంటున్నారు. తన స్నేహితురాలి వివాహం ఉందని చెప్పి పుష్ప, మరో స్నేహితురాలైన భోగాపురం గ్రామానికి చెందిన ఆళ్ల ఝాన్సీ కలిసి ఈనెల 6న పెందుర్తి వెళ్లారు. తిరిగి ఈనెల 10న ఉదయం పుష్ప ఇంటికి వచ్చింది. ప్రేమ విషయంలో సాయితో గొడవపడడంతో ఆమె ముభావంగా ఉండేది. అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు పుష్పను కిందకు దించి తగరపువలసలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పుష్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రేమ విఫలమైనందునే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని తండ్రి కనకరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. ఇంటికి ఆదాయం తెచ్చి, పెద్దదిక్కుగా ఉన్న కుమార్తె ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. పుష్ప మృతితో నారుపేటలో విషాదచాయలు అలముకున్నాయి.

# ఫరీద్‌పేటలో పట్టపగలే హత్య

## మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

## మృతుడి బంధువుల నిరసన

## ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



రణస్థలం,జూలై 13 (సందేశం టైమ్స్):ఎచ్చెర్ల మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన ఫరీద్‌పేట పరిధిలో పట్టపగలే ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, ఎంపీపీ మొదలవలస చిరంజీవి అనుచరుడు సత్తారు గోపి(46) హత్య గ్రామం లోనే కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో గోపి, మరో వ్యక్తి కోటేశ్వరరావుతో కలిసి బైక్‌పై కొయ్యరాళ్లు కూడలి నుంచి సర్వీసు రోడ్‌లో ఎచ్చెర్ల వైపు వెళ్తుండగా, అదే రోడ్‌లో ఉన్న ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు మూకుమ్మడిగా దాడిచేయగా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బైక్ వెనుక కూర్చొన్న కోటేశ్వరరావు ఈ ఘటనను చూసి అక్కడి నుంచి పరుగులు తీశాడు. సమాచారం అందుకున్న జేఆర్ పురం సీఐ ఎం.అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకుని పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతుండగానే హత్య జరగడంపై వారంతా నిరసన వ్యక్తంచేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డీఎస్పీ వివేకానంద ఆందోళనకారులతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పి శాంతింపజేశారు. కొయ్యరాళు జంక్షన్‌కు సమీపంలో సర్వీసు రోడ్‌లో బైక్‌పై ఎచ్చెర్ల వైపు వెళ్తున్న సత్తారు గోపి దుండగులు అడ్డగించి దాడిచేశారు. ఈ దాడి నుంచి తప్పించుకునేందుకు గోపి పరుగులు తీసి నా వెంబడించి మరీ హతమార్చారు. మృతదేహం వద్దనే కర్ర , ఇటుక పడి ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ సందర్శించి వివరాలు సేకరించింది. మృతుడిపై గతంలో పలు పోలీసు కేసులు నమోదయ్యాయి. పాత కక్షలతోనే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య సుగుణ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సుగుణ గ్రామ ఉప సర్పంచ్‌గా ఉన్నారు. మృతుడు గతంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. ఎస్పీ సందర్శన..ఘటనా స్థలాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. గ్రామంలో పర్యటించి పోలీస్ పికెట్‌ను మరింత పటిష్ఠంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



నాగులుప్పలపాడుజూలై 13 (సందేశం టైమ్స్): వసతి గృహాలలోని సిబ్బంది విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. అమ్మనబ్రోలు గ్రామంలోని గురుకుల పాఠశాల, ఎస్సీ వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఎస్సీ బాలుర వసతి గృహంలో వసతులను పరిశీలించారు.హాజరు, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో రిజిస్టర్ ప్రకారం సరుకులు లేకపోవడం, నిల్వలలో తేడా ఉండటం గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని వార్డెన్‌ను ఆదేశించారు. వసతిగృహంలోని కిటికీలకు దోమతెర మెష్‌లను ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలని, ఫిర్యాదుల పెట్టె, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠ్యాంశాల సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. కొన్ని విషయాలను ప్రిన్సిపాల్ మాధవిని అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలను చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతులను కల్పనకు నిధులు అందిస్తున్నట్లు చెప్పారు. అదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు పనిచేయాలని చెప్పారు. విద్యార్థినులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించి రుచి చూశారు. సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి నిర్మలాజ్యోతి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తిని 21 మంది విద్యార్థులకు అస్వస్థత



ఎటపాకజూలై 13 (సందేశం టైమ్స్):ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తిని 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 139 విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు పులిహోర, టమోటా పచ్చడి వడ్డించారు. అది తిన్న విద్యార్థులు పది నిమిషాల్లో అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే వారిని సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. మొత్తం 21మంది అస్వస్థతకు గురవ్వగా అందులో ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులే ఉన్నారు. అందులో ఆకుల రామలక్ష్మీ, బొగ్గా ప్రేమిక, రాయి లోకేశ్‌కు వాంతులు కావడంతో సెలైన్లు ఎక్కించి చికిత్స అందించారు. మరో 18 మంది విద్యార్థులకు కడుపు నొప్పి రావడంతో ప్రథమ చికిత్స చేశారు. అయితే ఊడికీ ఉడకని పులిహోర తినడం వల్లే విద్యార్థులకు అజీర్తీ చేసిందని, దాంతో అస్వస్థతకు గురైనట్టు వైద్యాధికారి దీవీనాగ్ తెలిపారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంటషెడ్డులేక బరకాలు కట్టి అపరిశుభ్ర వాతావరణంలో వంటలు తయారుచేస్తున్నట్టు విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బరకాలపై నుంచి ఆహారంపై ఈగలు, బొద్దింకలు పడుతున్నాయని విద్యార్థులు చెప్తున్నారు.విద్యార్థులకు అస్వస్థత విషయం తెలుసుకున్న ఐటీడీఏపీవో అపూర్వ భరత్ వెంటనే స్పందించారు. ఘటనపై వెంటనే విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఎంఈవో సరియం రాజులును ఆదేశించారు. దాంతో ఎంఈ వెంటనే గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులతో విచారణ జరిపారు. ఘటనకు గల కారణాలు, విద్యార్థులకు వడ్డించిన ఆహారం విషయంపై అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పీవో అడిగి తెలుసుకున్నారు.

# 20న రాజ్యాంగంపై వక్తృత్వ పోటీలు

ఒంగోలు కలెక్టరేట్,జూలై 13 (సందేశం టైమ్స్):భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు అన్నారు. స్థానిక ఎంసీఏభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు ఈనెల 20నుంచి 26వతేదీ వరకు ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో భారత రాజ్యాంగం కనీస అవగాహన అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతకు వేర్వేరు విభాగాల్లో పోటీలు జరుతాయన్నారు. జూనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.4వేలు, యువత విభాగంలో ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.7వేలతో పాటు మరో పది మందికి కాన్సొలేషన్ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. అనంతరం వారు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఓపీ డీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, రిటైర్డ్ హెచ్‌ఎం డి.వెంకటేశ్వర్లు, పీ డీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, గడ్డం మురహరిరావు, హరిప్రసాద్, లెక్చరర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 11 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్



రాజమహేంద్రవరం/రూరల్, జూలై 13 (సందేశం టైమ్స్): గోదావరి నదిలో ప్రతిరోజు రాత్రి పగలు తేడాలేకుండా డ్రెడ్జింగ్ బోట్లు ఇసుకను తోడేస్తున్నాయి. గామన్ బ్రిడ్జికి సమీపంలో డ్రెడ్జింగ్ పెద్దఎత్తున జరుగుతుంది. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక బోట్ల నుంచి రేవులకు చేరి అక్కడ నుంచి లారీల్లో సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో డ్రెడ్జింగ్ బోట్లపై నిఘాపెట్టిన మైనింగ్ అధికారులు మెరుపుదాడి చేశారు. గామన్ బ్రిడ్జికి మత్స్యకారుల నివాసాలకు మధ్యలో అమ్మవారి ఆలయం పక్కనే నిలుపుదల చేసిన 8 డ్రెడ్జింగ్ బోట్లను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. మాన్యువల్‌గా ఉన్నబోట్లను వదిలేశారు. దీంతో కాతేరు ,కోటిలింగాల ఇసుక రేవులు ఉలిక్కిపడ్డాయి. ఎందుకంటే దాదాపుగా అన్ని రేవులు కూడా డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించే ఇసుకను తోడేస్తున్నారు. ఈ ఘటనతో అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట జరుగుతున్న అక్రమాలు బయటపడ్డాయి. గురు, శుక్రవారాల్లో అధికారులు తనిఖీలు చేసి ధవళేశ్వరం, కోటిలింగాల, కాతేరు ప్రాంతాల్లో అనధికారికంగా..నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ చేసే 11 బోట్లను అధికారులు సీజ్ చేశారు. ధవళేశ్వరంలో లలితాదేవి పేరుతో ఉన్న డ్రెడ్జింగ్ బోటులో ఉన్న భీమడోలు మండలం ఆగడాలలంకకు చెందిన ఘంటసాల ఏసురాజు, బాలకోటి రామ్మూర్తిని ఆరా తీయగా యజమానులెవరో తెలియదని చెప్పడం గమనార్హం. కానీ విచారణలో విశాఖపట్నానికి చెందిన రాకేష్ ఈ బోటుకు యజమాని అని స్థానికంగా ఉన్న బిక్కన రవి అనే వ్యక్తి వీటిని పర్యవేక్షిస్తారని తేలినట్టు అధికారులు తెలిపారు.శ్రీలలిత బోటుతో పాటు శ్రీ లక్ష్మి గణపతి వీరభద్రయ్య , సద్గురు శ్రీ సాయినాథ సాత్విక్ డ్రెడ్జింగ్ బోటు, శ్రీలక్ష్మీ డ్రెడ్జింగ్ బోటును సీజ్ చేశారు.

## హైదరాబాద్‌లో దారుణం..
## యువకుడిపై కత్తితో దాడి



హైదరాబాద్:జూలై 13 (సందేశం టైమ్స్): భాగ్యనగరంలోని ఐటీ కారిడార్‌లో ఓ యువకుడిపై దుండగులు కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో యువకుడికి బలమైన గాయాలయ్యాయి. హైదరాబాద్‌లో చదువుకునేందుకు సోమాలియా నుంచి వచ్చిన అహ్మద్(25)పై దుండగులు కత్తితో దాడి చేశారు. అహ్మద్‌తో పాటు సోమాలియా నుంచి యూనిస్ అబ్ది కరీం హసన్(22) వచ్చారు. మాసబ్ ట్యాంక్‌లో నివాసం ఉంటూ హిమాయత్ నగర్‌లోని ఓ కాలేజీలో అహ్మద్ బీసీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల(జులై) 8వ తేదీన మాసబ్ ట్యాంక్ నుంచి ఐటీ కారిడార్‌కు ఇద్దరు సోమాలియా యువకులు ఓ పని నిమిత్తం బైక్‌పై వెళ్లారు. ఐకియా వద్ద అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో పక్కనే మరో బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని యువకులతో అహ్మద్, కరీం హసన్ ఘర్షణ పడ్డారు. మరో ఇద్దరు స్నేహితులను గుర్తుతెలియని ఆ ఇద్దరు యువకులు అక్కడికి పిలిపించారు. ఈ క్రమంలో సోమాలియా యువకులపై గుర్తు తెలియని యువకులు దాడికి పాల్పడ్డారు. గుర్తుతెలియని యువకుల్లో ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో సోమాలియా విద్యార్థి అహ్మద్ కడుపులో పొడిచి పరారయ్యాడు. అహ్మద్‌కు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం పక్కనే ఉన్న మెడికవర్ హాస్పిటల్‌కి తరలించారు. శస్త్రచికిత్స అనంతరం బాధితుడు అహ్మద్ కోలుకుంటున్నాడు. స్నేహితుడు యూనిస్ ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దాడికి పాల్పడ్డ ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడికి పాల్పడ్డ మరో ముగ్గురు యువకుల కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. నిందితుల బైక్ నెంబర్లు కనిపించకపోవడంతో ఐటీ కారిడార్‌లోని సీసీ కెమెరాలని పోలీసులు పరిశీలిస్తున్నారు.

## ప్రతీ శుక్ర, శని వారాల్లో..
## చర్లపల్లి నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్: జూలై 13(సందేశం టైమ్స్):ఆగస్టు నెలలో తొమ్మిది ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతీ శుక్ర, శని వారాల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి (07017), ప్రతి సోమ, శనివారాల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి (07018) రైళ్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ రైళ్లు మల్కాజిగిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట, కడప, ఒంటిమిట్ట, రాజంపేట రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతాయని పేర్కొన్నారు.- ఇక ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి తిరుపతికి (07251)రైలు... ప్రతి గురువారం తిరుపతి నుంచి చర్లపల్లికి (07252) నాలుగు రైళ్లు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోల్, నెల్లూర్, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.

## సిరిసిల్లలో గుర్తు తెలియని వాహనం
## ఢీకొని వ్యక్తి మృతి



సిరిసిల్ల రూరలజూలై 13 (సందేశం టైమ్స్):రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. తంగళ్లపల్లికి చెందిన ఎండీ భాషామియా (56)ను ఈ నెల 2న రాత్రి 10 గంటల సమయంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందారు. %భాషామియాకు భార్య హమీనా, కొడుకు షారుఖ్ ఖాన్,ఇద్దరు కూతుర్లు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన భాషామియా కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. హమీనా అనారోగ్యంతో బాధపడుతున్నదని, కొడుకు షారుక్ ఖాన్‌కు మానసిక స్థితి బాగాలేదని గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, ప్రమాదం జరిగి పది రోజులు కావస్తున్నా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు ఇంకా గుర్తించకపోవడం గమనార్హం.

## గంజాయి నిర్మూలనకు
## అధికారులు కృషి చేయాలి



భువనగిరి (కలెక్టరేట్), జూలై 13 (సందేశం టైమ్స్): విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకొని సంబంధిత అధికారులు గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై డీసీపీ అక్షాంశ్ యాదవ్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేస్తూ గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీసు, ఎక్సైజ్, ఔషధ తనిఖీ, విద్య, వైద్యశాఖలు, అటవీ శాఖ, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో గంజాయి నిర్మూలనకు పటిష్ఠమైన పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించే సందేశాత్మక వీడియోలను రూపొందించి స్కూల్స్, కళాశాలల్లో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో గుర్తించాలని, సరిహద్దు రాష్ట్రాలనుంచి జిల్లాకు రవాణా జరగకుండా అన్ని చెక్‌పోస్టులపై నిఘా పెంచాలన్నారు. డీసీపీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ డ్రగ్స్ కట్టడి, నిర్మూలనలో పోలీసులది కీలక పాత్ర అని, చెక్ పోస్టుల వద్ద నిఘా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, అటవీ శాఖ అధికారి పద్మజారాణి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, జిల్లా విద్యాధికారి కే. సత్యనారాయణ, డీపీవో సునంద తదితరులు పాల్గొన్నారు.

## ఈ స్నేహం.. భలే భలేగా ఉందే..



ఓదెల, జూలై 13(సందేశం టైమ్స్): పెద్దపల్లి జిల్లాలో ఓ కోతి.. బర్రెలతో స్నేహం సర్వత్రా చర్చకుదారితీసింది. ఇది పెద్దపల్లి మండలం కొత్తపల్లి- ఓదెల మండలం కొలనూర్ గ్రామాల ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నది. కొత్తపల్లి గ్రామానికి చెందిన చేగొండ మల్లయ్య బర్రెలను కాస్తుంటారు. అయితే ఏడాది క్రితం ఓ కోతి పిల్ల గ్రామంలో తప్పిపోయింది. దీంతో అది మల్లయ్య ఇంటి వద్ద ఉంటున్నది. అతడు రోజు తన బర్రెలను గ్రామ శివారు మైదాన ప్రాంతాలలో మేత కోసం తీసుకువెళ్తే.. ఆ కోతి కూడా బర్రెల వెంటే వెళ్తున్నది. %బర్రెల పైకి ఎక్కి ఎంచక్కా వెళ్తుండడాన్ని గమనిస్తున్న ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. గ్రామంలోకి ఇతర కోతులు వచ్చినా వాటి వెంబడి వెళ్లకుండా ఆ బర్రెల వద్దనే రాత్రి పడుకుంటుందని కాపరి మల్లయ్య తెలిపారు. రోజూ దానికి అన్నం పెడుతున్నాని, తమ బర్రెలతో ఇక్కడే గడుపుతుందని వెల్లడించారు. ఈ స్నేహాన్ని చూసినవారు భలే భలేగా ఉందే అంటున్నారు.

## పూసుగుప్ప'లో సంచార వైద్యశాల



చర్ల, జూలై 13(సందేశం టైమ్స్):చర్ల మండలంలోని తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ గ్రామం పూసుగుప్పలో సెంట్రల్ స్పెషల్ అసిస్టెన్స్ (సీఎస్ఏ) నిధులు రూ.కోటితో నిర్మించిన సంచార వైద్యశాల టెలీ ఆరోగ్య కేంద్రాన్ని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంలో ఉన్న ఈ గ్రామానికి 18 కిలోమీటర్లు ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి బైకులపై ప్రయాణించి చేరుకున్నారు. సంచార వైద్యశాల ప్రారంభం అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయంలో వైద్యం అందేది కాదని, ఆ సమయంలో ఇక్కడి గిరిజనులు ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. %భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఇక్కడ సంచార వైద్యశాలను ప్రారంభించామని అన్నారు. ఇక్కడ అన్ని రకాల మందులూ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ పథకాలను ఇక్కడి ఆదివాసీలకు అందజేయడంలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమని అన్నారు. ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, చర్ల సీఐ రాజువర్మ, బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు చెన్నూరి శ్రీనివాస్, ఈ.శ్రీనివాస్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

## వరండాలోనే తరగతులు



జూలై 13(సందేశం టైమ్స్):నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో గదుల కొరత వేధిస్తున్నది. ఒకే భవనంలో ఒకటి నుంచి పది వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 442 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరిపడా తరగతి గదులు లేకపోవడంతో వరండాలోనే విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై స్పందించిన ప్రభుత్వం మూడు గదులతోపాటు కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీని మంజూరు చేసింది. %కానీ ఇప్పటివరకు వాటి నిర్మాణ పనులు చేపట్టకపోవడం గమనార్హం. సరిపడా గదులు లేకపోవడంతో పాఠశాలకు సరఫరా చేసిన 12 కంప్యూటర్లను కూడా ఓ మూలన పడేశారు. మైదానం కూడా లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల వరండాలో, తరగతి గదుల్లోనే ప్రార్థన చేయాల్సి వస్తున్నది.

## చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న
## ఇద్దరి అరెస్టు

నీలగిరి, జూలై 13 (సందేశం టైమ్స్):ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేస్తూ వారి మెడలో నుంచి బంగారు పుస్తెలను ఎత్తుకెళ్తున్న అన్నతమ్ముళ్లను అరెస్టు చేసి వారి నుంచి 19.5 తులాల బంగారం, నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చండూర్ మండలం గొల్లగూడెంలో మారగోని బుచ్చమ్మ చెల్క నుంచి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇడికుడ దారి ఎటువైపు అంటూ అడిగి మాటల్లో పెట్టి అవె మెడలోని మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని వెళ్లినట్లు తెలిపారు. %దీనిపై నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలోచండూర్ ఎస్ఐ వెంకన్న, కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి సిబ్బందితో నాలుగు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 సమయంలో చం డూరు ఎస్ఐ వెంకన్న తాసానిగూడెం శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా, ఇద్ద రు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని వివరాలు అడగ్గా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



# క్రీడావార్తలు



## గిల్ క్రేజీ రికార్డ్.. విరాట్ కోహ్లీని దాటేశాడు!




భారత టెస్ట్ జట్టు నూతన సారథి శుబ్‌మన్ గిల్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. టీమిండియా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి అతడి బ్యాట్ ఒక రేంజ్‌లో గర్జిస్తోంది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో పరుగుల వర్షం కురిపిస్తున్నాడు గిల్. ఈ క్రమంలో పలు పాత రికార్డులకు పాతర పెడుతూ పోతున్నాడు. లార్డ్స్ టెస్ట్‌లో మరో క్రేజీ రికార్డు సృష్టించాడు శుబ్‌మన్. ఏకంగా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అతడు అధిగమించాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆడిన 4 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 585 పరుగులు చేసిన గిల్.. లార్డ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 16 పరుగులు చేశాడు. దీంతో 601 పరుగులకు చేరుకున్నాడు. తద్వారా ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్ల జాబితాలో రెండో స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లండ్ గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌ల్లో కెప్టెన్‌గా అత్యధిక పరుగులు బాదిన వారి లిస్ట్‌లో లెజెండ్ రాహుల్ ద్రవిడ్ (4 ఇన్నింగ్స్‌ల్లో 602 పరుగులు) టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానంలో గిల్ (601) నిలిచాడు. శుబ్‌మన్ తర్వాతి స్థానాల్లో వరుసగా విరాట్ కోహ్లీ (593), సునీల్ గవాస్కర్ (542) ఉన్నారు. ఓవరాల్‌గా ఇంగ్లండ్‌పై అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్ల జాబితాలో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (5 మ్యాచుల్లో 712 పరుగులు) అగ్రస్థానంలో ఉన్నాడు. సిరీస్‌లో ఇంకా రెండు మ్యాచులు ఉన్నందున జైస్వాల్‌ను గిల్ అలవోకగా దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కరుణ్ నాయర్ ఖేల్‌ఖతం.. ఇక డొమెస్టిక్ క్రికెట్ ఆడుకోవాల్సిందే!




...రత జట్టులోకి చోటు కోసం తీవ్ర పోటీ ఉంటుంది. తోపు ఆటగాళ్లకు కూడా అంత సులువుగా అవకాశాలు రావడం లేదు. కాంపిటీషన్‌ను తట్టుకొని టీమిండియాలోకి ఎంట్రీ ఇస్తే గొప్పే అని చెప్పాలి. అరంగేట్రం చేయాలనుకుంటున్న కుర్రాళ్లకు ఇది కాస్త ఈజీనే. కానీ ఇప్పటికే భారత జట్టుకు ఆడి దూరమైన ఆటగాళ్లు.. రీఎంట్రీ ఇవ్వాలంటే మాత్రం ఏళ్ల పాటు వేచి చూడక తప్పని పరిస్థితి. ఒకవేళ ఎంట్రీ ఇచ్చినా.. రాణించకపోతే మాత్రం అడ్రస్ గల్లంతయ్యే ప్రమాదమే ఎక్కువ. వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. లేక లేక వచ్చిన అవకాశాన్ని అతడు చేజేతులా మిస్ చేసుకుంటున్నాడు. దీంతో నాయర్ ఖేల్‌ఖతం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత జట్టు తరఫున 2017లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు కరుణ్ నాయర్. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఏకంగా ట్రిపుల్ సెంచరీ బాది భవిష్యత్తుపై భరోసా పెంచాడు. అయితే ఆ తర్వాత ఊహించని విధంగా జట్టుకు దూరమైన నాయర్.. రీఎంట్రీ కోసం ఏళ్ల పాటు ప్రయత్నించినా సక్సెస్ కాలేదు. ఎట్టకేలకు ప్రస్తుత ఇంగ్లండ్ సిరీస్‌తో అదృష్టం అతడి తలుపు తట్టింది. అయితే లక్‌ను నాయర్ సరిగ్గా వాడుకోవడం లేదు. వరుస వైఫల్యాలతో తీవ్ర విమర్శలు మూటగట్టుకుంటున్నాడు. దీంతో వెళ్లి డొమెస్టిక్ క్రికెట్ ఆడుకో.. ఇది నీకు సెట్ అవ్వదంటూ అతడిపై సోషల్ మీడియాలో నెటిజన్స్ సీరియస్ అవుతున్నారు.

## బయటపడ్డ గిల్-సారా రిలేషన్‌షిప్.. ఆటాడుకున్న జడేజా!




క్రికెటర్ల లవ్ లైఫ్‌కు సంబంధించిన ఏదో ఒక రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. ఫలానా అమ్మాయితో ప్రేమలో ఉన్నారు, ఫలానా హీరోయిన్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో అనేక పుకార్లు వస్తుంటాయి. టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మీద కూడా ఇలాంటి రూమర్లు రావడం గమనించే ఉంటారు. బ్యాటింగ్ గ్రేట్ సచిన్ టెండూల్కర్ కూతురు సారా టెండూల్కర్‌తో గిల్ ప్రేమాయణం నడిపిస్తున్నాడని చాన్నాళ్లుగా పుకార్లు వస్తున్నాయి. శుబ్‌మన్ ఆడే మ్యాచులకు స్టేడియంలో సారా హాజరవడం, అతడి బ్యాటింగ్ టైమ్‌లో చప్పట్లు కొడుతూ ఆమె ఎంకరేజ్ చేయడం అప్పట్లో వైరల్‌గా మారింది. మరోసారి వీళ్లిద్దరూ హాట్ టాపిక్‌గా మారారు. అసలేం జరిగిందంటే.. దిగ్గజ క్రికెటర్ యువరాజ్ సింగ్ క్యాన్సర్ బాధితుల కోసం ఇటీవల ఓ చారిటీ కార్యక్రమం నిర్వహించారు. లండన్‌లో జరిగిన ఈ ప్రోగ్రామ్‌లో మాజీ క్రికెటర్లతో పాటు ప్రస్తుత భారత జట్టు ఆటగాళ్లు కూడా హాజరయ్యారు. ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న టీమిండియా ప్లేయర్లు ఈ వేడుకకు అటెండ్ అయ్యారు. బ్యాటింగ్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ ఫ్యామిలీతో కలిసి ఈ ప్రోగ్రామ్‌కు వచ్చారు. భారత జట్టు ఆటగాళ్ల పక్కనే సచిన్ కుటుంబసభ్యులు కూర్చున్నారు. ఈ తరుణంలో గిల్‌ను ఆటపట్టించడం మొదలుపెట్టాడు జడేజా. అటు చూడు అంటూ అతడ్ని ఓ ఆటాడుకున్నాడు. జడేజా గిల్‌ను ఆటపట్టిస్తున్న సమయంలోనే సారా శుబ్‌మన్‌ను ఓరకంటితో చూసింది. అంతే జడ్డూతో పాటు కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ కూడా నవ్వుల్లో మునిగిపోయారు. గిల్‌ను మరింత ఆటపట్టించసాగారు. ఈ కార్యక్రమంలో గిల్ సారాను చూడటం, సారా ఓరకంటితో అతడి వైపు చూడటం.. శుబ్‌మన్‌ను జడేజా ఆటపట్టిస్తున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన నెటిజన్స్.. గిల్-సారా రిలేషన్‌షిప్ మరోమారు బయటపడిందని అంటున్నారు. వీళ్ల మధ్య ప్రేమ నిజమేనని, త్వరలో ఇద్దరూ పెళ్లి పీటలెక్కడం ఖాయమని కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఇప్పటిదాకా గిల్-సారాలో ఎవరూ దీని మీద స్పందించలేదు. కాబట్టి వాళ్ల నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఏదీ చెప్పలేం.

## డబ్బుల కోసమే ఇలా చేస్తున్నారు.. బుమ్రా సంచలన వ్యాఖ్యలు!




టీమిండియా పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రా మరోమారు విమర్శకులపై సీరియస్ అయ్యాడు. వాళ్లకు సంచలన వార్తలు, వ్యూస్, సబ్‌స్క్రైబర్స్ కావాలంటూ గరంగరం అయ్యాడు. తన వల్ల వాళ్లు డబ్బులు కూడగట్టుకుంటున్నారని చెప్పాడు. వాళ్లకు మనీ వస్తున్నాయంటే సంతోషిస్తానని తెలిపాడు. లార్డ్స్ టెస్ట్ రెండో రోజు ఆట ముగిశాక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ వ్యాఖ్యలు చేశాడు బుమ్రా. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అదరగొట్టాడు భారత స్పీడ్‌స్టర్. 5 వికెట్లతో ఆతిథ్య జట్టు నడ్డి విరిచాడు. స్టోక్స్ సేనను 400 పరుగులు దాటకుండా అడ్డుకున్నాడు. డే-2 ఆట ముగిసిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌కు హాజరైన బుమ్రా.. విమర్శకులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇంతకీ అతడేం అన్నాడంటే..‘వ్యూస్, సబ్‌స్క్రైబర్స్ కావాలి. ఈ విషయంలో ఎవ్వర్నీ ఏమీ అనలేం. ఒకవేళ వాళ్లు గనుక నా వల్ల బాగా డబ్బులు సంపాదిస్తున్నట్లయితే నాకు సంతోషమే. అది మంచి విషయమే. వాళ్ల ఆశీస్సులు నాకు ఉంటాయని భావిస్తున్నా. నేను క్రికెట్ ఆడినన్ని రోజులు, భారత జెర్సీ వేసుకున్నంత వరకు, వాళ్లు నన్ను జడ్జ్ చేస్తూనే ఉంటారు’ అని బుమ్రా చెప్పుకొచ్చాడు. కెరీర్ ఆరంభం నుంచి తనపై విమర్శలు రావడం చూస్తూనే ఉన్నానని.. ఇవేవీ పట్టించుకోనన్నాడు. తన పని తాను చేసుకుంటూ వెళ్తానని స్పష్టం చేశాడు. లార్డ్స్ టెస్ట్‌లో 5 వికెట్లు తీశాక బుమ్రా సెలబ్రేట్ చేసుకోలేదు. సాధారణంగా టెస్టుల్లో ఫైవ్ వికెట్ హాల్ తీసుకుంటే ఏ బౌలర్ అయినా సెలబ్రేట్ చేసుకుంటారు. అందునా క్రికెట్‌కు పుట్టినిల్లు అయిన లార్డ్స్‌లో ఆ ఫీట్‌ను అందుకుంటే వారి ఆనందానికి హద్దులు ఉండవు. ఈ ఘనత సాధించిన బౌలర్ పేరును స్టేడియంలోని హానర్స్ బోర్డులో చేరుస్తారు. అందుకే ఇక్కడ ఫైవ్ వికెట్ హాల్ తీయాలని చాలా మంది బౌలర్లు కలలు కంటారు. అయితే బుమ్రా మాత్రం 5 వికెట్లు తీశాక కూడా సెలబ్రేట్ చేసుకోలేదు. దీనిపై అతడు స్పందిస్తూ.. తాను అలసిపోయానని, అందుకే సెలబ్రేట్ చేసుకోలేదన్నాడు.

## విహార యాత్ర కోసం రాలేదు



లండన్: భారత క్రికెటర్లు విదేశీ పర్యటనలకు వెళ్లేది విహారం కోసం కాదని, ఎక్కువ సమయం ఆటపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుందని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. ఈమేరకు కుటుంబ సభ్యులను తమ వెంట తెచ్చుకోవడంపై బీసీసీఐ విధించిన ఆంక్షలకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ‘ఎవరికైనా కుటుంబాలు ముఖ్యమే. కానీ ఆటగాళ్లు ఓ విషయం గుర్తుంచుకోవాలి. మీరంతా ఇక్కడికి వచ్చింది హాలీడే కోసం కాదు. ఓ లక్ష్యంతో వచ్చారు. ఎంతో మందిలో కేవలం మీకు మాత్రమే దేశం గర్వపడేలా ఆడే అవకాశం వచ్చింది. అందుకే దృష్టంతా ఆటపైనే ఉండడం అవసరం’ అని పుజారకిచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ తేల్చాడు.

## సచిన్ వల్ల కానిది బుమ్రా సాధించాడు.. ఫ్యాన్స్ కాలర్ ఎగరేసే ఫీట్!




క్రికెట్‌కు పుట్టినిల్లు లాంటి లార్డ్స్‌లో జరిగే టెస్టుల్లో ఏ క్రికెటర్ అయినా అదరగొట్టాలనే అనుకుంటారు. రెగ్యులర్ పెర్ఫార్మెన్స్ కంటే కూడా ఇక్కడ మరింతగా రాణించాలని చూస్తారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ స్టేడియంలోని హానర్స్ బోర్డులో తమ పేరు చూసి మురిసిపోవాలని చాలా మంది ప్లేయర్లు కలలు కంటారు. కానీ కొందరు మాత్రమే దీన్ని సాధించగలరు. ఎన్నో రికార్డులకు పాతర పెట్టిన మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. లార్డ్స్‌లో మాత్రం సెంచరీ బాదలేదు. అందుకే హానర్స్ బోర్డులో అతడి పేరు లేదు. అలాంటిది టీమిండియా పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రా ఇది చేసి చూపించాడు. సచిన్ వల్ల కానిది బుమ్రా సాధించాడు.ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో 5 వికెట్లు పడగొట్టాడు బుమ్రా. సెంచరీ హీరో జో రూట్ (104), హ్యారీ బ్రూక్ (11), కెప్టెన్ బెన్ స్టోక్స్ (44)తో పాటు క్రిస్ వోక్స్ (0), జోఫ్రా ఆర్చర్ (4)ను ఔట్ చేశాడు

## మిక్స్‌డ్ కాంస్య పోరుకు సురేఖ జోడీ

మాడ్రిడ్: తెలుగు స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ కప్ స్టేజ్-4 పోటీల్లో మరో రెండు పతకాలకు చేరువైంది. ఇప్పటికే సహచరులతో కలిసి కాంపౌండ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన సురేఖ.. తాజాగా వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్‌కు, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం పోరుకు చేరుకుంది. శుక్రవారం జరిగిన మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్‌లో టాప్‌సీడ్ సురేఖ 147-144తో హాజల్ బురున్ (తుర్కియే)ని ఓడించి సెమీస్ చేరింది. ఇదే కేటగిరిలో మరో భారత అమ్మాయి పర్ణీత్ కౌర్ 142-141తో ఓజ్నూర్ (తుర్కియే)పై గెలిచి సెమీస్‌లో ప్రవేశించింది. ఇక కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో భారత ద్వయం, టాప్‌సీడ్ సురేఖ/రిషభ్ యాదవ్ 152-155తో నెదర్లాండ్స్ జంట చేతిలో ఓటమిపాలైంది. దీంతో శనివారం జరిగే కాంస్య పతక పోరులో ఎల్ సాల్వడార్ జంటతో సురేఖ జోడీ తలపడనుంది.

# బిజినెస్



## ఈ యాప్స్‌తో వృథా ఖర్చులకు కళ్లెం.. ఓసారి ట్రై చేసి చూడండి

ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుతం చెల్లింపులకు రకరకాల మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో, డబ్బు ఖర్చుపై కన్నేసి ఉంచడం కష్టంగా మారింది. మనకు తెలియకుండానే ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అయితే, ఈ ఖర్చులకు పగ్గాలు వేసి పొదుపునకు మార్గం సుగమం చేసే కొన్ని యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో చాలా మటుకు ఉచితమే. మరి ఈ యాప్స్ ఏంటో ఈ కథనంలో తెలుసుకుందాం %యాక్సియో యాప్ మంచి పాప్యులారిటీ సాధించింది. ఖర్చులను ట్రాక్ చేసేందుకు ఉద్దేశించిన ఈ యాప్‌తో డబ్బు చెల్లింపులపై నిఘా పెట్టొచ్చు. మొబైల్ నెంబర్ ఆధారంగా ఈ యాప్ వివిధ బ్యాంక్ అకౌంట్‌లను, క్రెడిట్ కార్డులను లింక్ చేస్తుంది. మొబైల్‌కు వచ్చే మెసేజీల ఆధారంగా ఖర్చులపై నిఘా పెడుతుంది. చెల్లింపులకు సంబంధించి యూజర్లు నెలవారీ టార్గెట్స్‌ను ఈ యాప్‌లో సెట్ చేసుకోవచ్చు. బిల్లులు, ఇతర చెల్లింపులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఈ యాప్ యూజర్లకు రిమైండర్ల ద్వారా గుర్తు చేస్తూ ఉంటుంది.ఏవైనా లక్ష్యాల కోసం ప్రత్యేకంగా డబ్బు ఆదా చేయాలనుకునే వారికి లూట్ ఉపయుక్తం. ఇందులోని వర్చువల్ సేవింగ్స్ జార్.. మీరు డబ్బు డిపాజిట్ చేసే కొద్ది నిండుతున్నట్టు కనిపిస్తుంది. రోజువారీ, నెలవారీగా ఎంతెంత పొదుపు చేస్తున్నదీ యూజర్లు ఈ యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. స్వల్పకాలిక పొదుపు చర్యలకు ఇది చాలా ఉపయుక్తం అని యూజర్లు చెబుతుంటారు.ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ కోసం ఉద్దేశించిన సమగ్ర సాధనం మింట్ యాప్. ఇందులో బడ్జెటింగ్, క్రెడిట్ స్కోరు మానిటరింగ్ కోసం ప్రత్యేక సాధనాలు ఉంటాయి. ఎప్పటికప్పుడు అలర్ట్‌లను పంపించే ఫీచర్ ఇందులో ఉంది. యాపిల్ వాచ్ సపోర్టు కూడా ఇందులో అందుబాటులో ఉంది. యూజర్లు తమ ఆన్‌లైన్ ఫైనాన్స్ అకౌంట్‌లను దీనికి జత చేసి రాబడి పోబడులపై సమగ్ర నిఘా పెట్టొచ్చు. అయితే, ఇది అమెరికా, కెనడాలోని యూజర్లకే అందుబాటులో ఉంది.యాక్సియో లాగా ఖర్చులపై నిఘా కోసం ఉద్దేశించిన యాప్ వాలెట్. ఇది బ్యాంక్ అకౌంట్‌లకు కనెక్ట్ అయ్యి డాటాను ఆటోమేటిక్‌గా డౌన్ లోడ్ చేస్తుంది. రాబడి



పోబడులపై సమగ్ర నివేదికలను సిద్ధం చేస్తుంది. స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి వాటిపై కూడా ఈ యాప్‌తో నిఘా పెట్టొచ్చు. ఆటోమేటిక్ క్లౌడ్ సింక్రోనైజేషన్, ట్రాన్సాక్షన్ లోకేషన్ ట్రాకింగ్, డెట్ మేనేజ్‌మెంట్ వంటివి ఇందులో అందుబాటులో ఉన్నాయి.రియల్ బైట్ ఇంక్ సంస్థ రూపొందించిన మనీ మేనేజర్‌తో ఖర్చులు, చెల్లింపులకు సంబంధించి రోజువారీ, నెలవారీగా నివేదికలు పొందొచ్చు.

## దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి రూ.1,345 కోట్లతో ప్రత్యేక నిధి




న్యూఢిల్లీ: దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం ముందుకు వచ్చే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు రూ. 1,345 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామి ఈ విషయం ప్రకటించారు. రాష్ట్రాలతో చర్చించిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పెడతామని ఆయన చెప్పారు.అయితే రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీకి రెండు కంపెనీలను మాత్రమే ఎంపిక చేయనున్నట్టు కుమార స్వామి తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తి, వాటిని శుద్ధి చేయడం, శుద్ధి చేసిన ఖనిజాల నుంచి తుది ఉత్పత్తులైన రేర్ ఎర్త్ మాగ్నెట్ల తయారీ వరకు అన్ని దశల్లోనూ కంపెనీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పటికే వినియోగించి పారేసిన రేర్ ఎర్త్ మాగ్నెట్లను కరిగించి ఆ భస్మంతో మాగ్నెట్లను తయారు చేసేలా కంపెనీలను ప్రోత్సహించడం తమ లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది.ఆటోమొబైల్, కంప్యూటర్ చిప్స్, విండ్ టర్బైన్స్‌లో రేర్ ఎర్త్ మాగ్నెట్లు కీలకం. ప్రస్తుతం ఈ మాగ్నెట్ల ఉత్పత్తిలో చైనాదే హవా. ప్రపంచ ఉత్పత్తిలో 90 శాతం చైనాలోనే కేంద్రీకృతమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చైనా మన దేశానికి వీటి ఎగుమతులను నిలిపివేసింది. దీంతో దేశీయ ఆటోమొబైల్ కంపెనీలు ముఖ్యంగా విద్యుత్ వాహనాల కంపెనీలు వీటి సరఫరా కోసం అరిచి గగ్గోలు పెడుతున్నాయి. అయినా చైనా నుంచి ఉలుకూ పలుకు లేదు. ప్రత్యామ్నాయాలు చూద్దామన్నా పెద్దగా ఫలించడం లేదు. దీంతో సొంత కాళ్లపై నిలబడడం తప్ప వేరే మార్గం లేదని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. అందులో భాగంగానే దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఉత్పత్తికి ముందుకు వచ్చే కంపెనీలను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

## ముంబైలో టెస్లా షోరూమ్ రెడీ




న్యూఢిల్లీ: ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా భారత మార్కెట్లోకి లాంఛనప్రాయంగా ప్రవేశించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. వచ్చే వారం ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ప్రారంభించనుంది. అమెరికాకు చెందిన కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఈ విద్యుత్ కార్ల దిగ్గజం ఈ నెల 15న నిర్వహిస్తున్న ప్రారంభ కార్యక్రమానికి ఎంపిక చేసిన వారికి ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. అయితే దీనిపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధులెవరూ అందుబాటులో లేరు. ఆస్టిన్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఈ కంపెనీ చైనా ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన మోడల్ వై రియర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ సహా కొన్ని మోడళ్లను ముంబై చేర్చిందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ షోరూమ్ కోసం టెస్లా ఇప్పటికే 24,565 చదరపు అడుగుల విస్తీర్ణం గల వేర్‌హౌస్‌ను లోధా లాజిస్టిక్స్ పార్క్ నుంచి ఐదేళ్ల కాలానికి లీజుకి తీసుకుంది. 40 వేల డాలర్ల లోపు ధరల శ్రేణిలోని కార్లకు 70 శాతం కస్టమ్స్ సుంకాన్ని, ఆ పైబడిన ధరలోని కార్లకు నూరు శాతం కస్టమ్స్ సుంకాన్ని భర్తీ చేసుకునేందుకు ప్రారంభ టారిఫ్ రాయితీలు కల్పించాలని భారత ప్రభుత్వాన్ని ఆ సంస్థ కోరుతోంది.

## హెల్త్‌కేర్‌లోకి అదానీ గ్రూప్




ముంబై: అదానీ గ్రూప్.. ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా ముంబై, అహ్మదాబాద్ నగరాల్లో అత్యాధునిక సదుపాయాలతో రెండు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తోంది. ముంబైలో జరిగిన ఒక సదస్సులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ విషయం వెల్లడించారు. తాము ఏర్పాటు చేసే ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ, చికిత్సల్లో కృత్రిమ మేధను ఎక్కువగా ఉపయోగించనున్నట్టు తెలిపారు. అనేక వ్యాధులకు ఒకేచోట చికిత్స అందించేలా ఈ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులు, కొవిడ్ వంటి మహమ్మారులు వ్యాపించినప్పుడు ఈ ఆస్పత్రుల సామర్థ్యాన్నీ వెంటనే విస్తరించవచ్చన్నారు. అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని అదానీ స్పష్టం చేశారు.

## ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు



ముంబై: ఐటీ, ఆటో, ఎనర్జీ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి శుక్రవారం మార్కెట్‌ను కుంగదీసింది. కార్పొరేట్ ఫలితాల సీజన్‌కు ఐటీ దిగ్గజం టీసీఎస్ నిరుత్సాహపూరితమైన ప్రారంభం అందించడం ఐటీ, ఆటో, ఇంధన కౌంటర్లలో అమ్మకాల ఒత్తిడిని పెంచింది. దీనికి తోడు టారిఫ్ సంబంధిత అస్థిరతలు, ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన మిశ్రమ సంకేతాలు మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 689.91 పాయింట్ల నష్టంతో 82,500.47 వద్ద స్థిరపడగా నిఫ్టీ 205.40 పాయింట్ల నష్టంతో 25,149.85 వద్ద క్లోజైంది. రిజిస్టర్ కాని ఆన్‌లైన్ బాండ్ వేదికలను నమ్మొద్దు: వివిధ స్థిరాదాయ పెట్టుబడి సాధనాల కు ప్రవేశం కల్పిస్తున్న రిజిస్టర్ కాని ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌ను విశ్వసించవద్దని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తమ ఇన్వెస్టర్లను హెచ్చరించాయి. ఆన్‌లైన్ బాండ్లలో పెట్టుబడులు పెట్టే సమయంలో కంపెనీలకు సంబంధించిన విశ్వసనీయ అంశాలను పరిశీలించాలని తెలిపాయి.

## 8 బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఝలక్




న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా పాలసీల సెటిల్‌మెంట్స్ లోపాలపై బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఎనిమిది బీమా కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ కంపెనీలన్నీ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి గత ఏడాది మే నెలలో తాము జారీ చేసిన 'హెల్త్ ఇన్సూరెన్స్ మాస్టర్ సర్క్యులర్' నిబంధనలు తుంగలో తొక్కాయని పేర్కొంది. ప్రైవేట్ రంగంలోని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, స్టార్ హెల్త్ అండ్ అల్లైడ్ ఇన్సూరెన్స్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, మణిపాల్‌సిగ్మా హెల్త్ ఇన్సూరెన్స్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫసీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్‌తో పాటు ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీకి కూడా ఈ నోటీసులు అందాయి.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006